క్లుప్తంగా

విద్యుత్‌ను ఆదా చేద్దాం



కోసిగిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

కోసిగి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పురవీధుల గుండా ర్యాలీ చేపట్టి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. మంగళవారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగస్వామి ఆధ్వర్యంలో విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌ను వృధా చేయకుండా అవసరం మేరకే వాడుకోవాలన్నారు. ఇదివరకే వాతావరణంలో వర్షపాతం తగ్గుముఖం పట్టిందని, వాతావరణ కాలుష్యం పెరిగిపోతోందన్నారు. రాను రాను జలవనరులు తగ్గిపోవడంతో విద్యుత్ ఉత్పత్తి కూడ తగ్గుముఖం పడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ విద్యుత్ ఆదా చేసుకోవాలని సూచించారు. విద్యుత్ ఆదాపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు సాయికుమార్, గోపి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంను చూపుతున్న రైల్వే పోలీసులు

ఆదోని సెంట్రల్: నాగర్ కోయిల్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ జనరల్ బోగీలో మంగళవారం కర్ణాటకకు చెందిన ఒరిజినల్ ఛాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా ఆదోని పట్టణంలో స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. వారు మట్లాడుతూ బోగీలోని బాత్రుం నందు అనుమానాస్పదంగా ఉన్న నాలుగు బ్యాగులను పరిశీలించగా అందులో 10 మద్యం బాక్స్‌లు ఉన్నాయన్నారు. వాటిలో మొత్తం 960 మద్యం టెట్రా ప్యాకెట్లు ఉన్నాయని, వాటి విలువ సుమారు రూ.45,000 ఉంటుందని తెలిపారు. స్వాధీనం చేసుకున్న ప్యాకెట్లను తదుపరి చర్యలు నిమిత్తం ఆదోని సెబ్ వారికి అప్పగించినట్లు వెల్లడించారు.

గడ్డివామి దగ్ధం

ఆస్పరి: మండలంలోని అట్టెకల్లు గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రైతు పరుశన్నకు చెందిన గడివామి దగ్ధమైంది. దీంతో రైతుకు రూ.30 వేలు నష్టం జరిగింది. ఊరి చివరన గడ్డివామిలో మంటలు చెలరేగడంతో గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. ఈ లోపే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న పత్తికొండ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపు చేశారు.

జీవాల పెంపకంలో రాణించాలి



మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఆస్పరి: లాభదాయకమైన గొర్రెల పెంపకం చేపట్టాలని ప్యాపిలి గొర్రెల పెంపకందారుల శిక్షణ కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గొర్రెల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని ఆస్పరి పశు వైద్యశాల సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గొర్రెల మందలో జాతి లక్షణాలు కలిగిన విత్తనపు పొట్టేళ్లు ఉండేలా చూసుకోవాలన్నారు. గొర్రెలకు పాకలు ఏర్పాటు చేసుకోవాలని, శ్రేష్టమైన మేపు, పశు గ్రాసం అందించాలని సూచించారు. వ్యాధి బారిన పడిన గొర్రెలను మంద నుంచి వేరుచేసి చికిత్స అందించడం ద్వారా మరణాల శాతం తగ్గించవచ్చన్నారు. గొర్రెలలో పారుడు, గాలికుంటు వ్యాధి, చిటుక రోగము, బొబ్బ వ్యాధి, నీలి నాలుక, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నట్టల నివారణ, పిరుదులు, మిన్నల్లుల నివారణ వంటి వైరస్ వల్ల సంక్రమించే వ్యాధుల నివారణ, అందించాల్సిన చికిత్స, జాగ్రత్తలను వివరించారు. పశు వైద్యాధికారులు శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్, ఫణీంద్రకుమార్, జానకి, పాడి రైతులు పాల్గొన్నారు.

ఉరుసు ప్రశాంతంగా జరుపుకోండి

హొళగుంద: రేపటి నుంచి జరిగే ఎల్లార్తి షేక్షావలి, షాషావలి ఉరుసు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు, హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులతో కలిసి ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాలను దర్శించుకున్నారు. అనంతరం దర్గా పరిసరాలు, గ్రామంలో పర్యటించారు. ఉరుసులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిఘా ఉంచాలని సీఐ, ఎస్‌ఐను ఆదేశించారు. భక్తులు ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.

సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా



ఆదోనిలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



సురక్ష కిట్టు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత

ఆదోనిటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భరోసానిస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అనుపమ పేర్కొన్నారు. సురక్ష కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 32, 38, 39 వార్డులను కలిపి ఆ వీధిలోని టీటీడీ కళ్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక అర్బన్‌హెల్త్ సెంటర్, ఏరియా, ఆస్పత్రి డాక్టర్లు ఎనిమిది మంది, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొని ప్రజలకు సేవలందించారు. రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ, టీబీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, గర్భవతులకు పరీక్షలు, కంటి పరీక్షలు, చిన్నారులకు సంబంధించిన రక్త పరీక్షలు తదితర పరీక్షలను చేసి మందులను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రయివేట్ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చవుతుందని, ప్రభుత్వం ఉచితంగానే పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తుందని చెప్పారు. అన్ని వ్యాధులకు పరీక్షలు చేయించుకొని, మందులను పొందాలని, వ్యాధి తీవ్రత ఉన్న వారిని మెరుగైన వైద్యం కోసం ఏరియా, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయడం జరుగుతుందన్నారు.

ఆదోనిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ నాగరాజు, సర్పంచ్ బసవరాజు సూచించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మాంత్రికి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు శాంతిజ్యోతి, జి.రవిచంద్రకుమార్, యశ్వంత్, మయూర్‌కుమార్ మొత్తం 504 మంది ఓపీ రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాంత్రికి గ్రామంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



హెచ్.మురవణిలో ఓపీ నమోదు దృశ్యం

పెద్దకడబూరు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డీఎల్‌డీఓ నాగేశ్వరరావ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామంలో సర్పంచ్ జానకమ్మ ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు బాలకృష్ణ, తాహెర్, సుస్మిత, మహేష్ 346 మంది రోగులకు బీపీ, షుగరు, రక్త పరీక్షలు, ఈసీజీ వంటి 7 రకాల పరీక్షలు చేశారు. వారిలో 12 మందిని మెరుగైన చికిత్స కోసం కర్నూల్‌కు రెఫర్ చేశారు. 57 మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రాలయం: పేదలఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చిలకలడోణ గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. 69 మందికి కంటి వెలు గు, 47 మంది విద్యార్థులు, 44 మంది గర్భిణు లు మొత్తం 505 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్యులు రవీంద్రదీపక్, భావన, వసంత, అరుణ వైద్య సేవలదించారు. సర్పంచు గుజ్జల నాగమ్మ, ఎంపీడీఓ మణిమంజరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చిలకలదోణ గ్రామంలో చికిత్స చేస్తున్న వైద్యులు



కుంబళనూరులో ఆయుష్మాన్ కార్డుల పంపిణీ

కౌతాళం: ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు అందించడంతో రోగాలకు చెక్ పెట్టవచ్చని కుంబళనూరు సర్పంచ్ వీరేష్, తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కుంబళనూరులో మంగళవారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రజలు వైద్యం కోసం ఇబ్బంది పడకుండా ప్రత్యేక శిబిరాల ద్వారా గ్రామాల్లోనే స్పెషలిస్ట్ వైద్యులతో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు వివరించారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సిబ్బంది న్యూట్రిషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసి పౌష్టికాహారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కుంబళనూరుకు చెందిన రోగిని ఆటోలో వైద్య శిబిరానికి తీసుకుని రాగా డాక్టర్లు పరీక్షలు చేసి కర్నూలుకు రెఫర్ చేశారు. డాక్టర్ ఇమ్మాన్యుయల్, కార్యదర్శి యోగేశ్వర్‌రెడ్డి, నాయకులు అనిల్‌కుమార్, బుచ్చయ్యచౌదరి, వాలంటీర్లు పాల్గొన్నారు.



ఆటోలో తీసుకొచ్చిన రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

కండక్టర్‌పై దాడి

ఆదోనిఅర్బన్: పట్టణంలోని మేదర్‌గేరి కొత్త ఓవర్ బ్రిడ్జి వద్ద ఆర్టీసీ బస్సు కండక్టర్ విజయ్‌కుమార్‌పై ముగ్గురు యువకులు మంగళవారం దాడి చేశారు. ఆర్టీసీ కార్మికులు, బాధితుడు తెలిపిన వివరాలు.. బైకుపై ముగ్గురు యువకులు వెళుతూ బస్సుకు అడ్డు రావడంతో హెచ్చరించగా వారు బస్సును అడ్డుకుని కండక్టర్‌పై దాడి చేశారు. ఆదోని నుంచి నదిచాగికి బస్సు వెళ్తుండగా దాడి జరిగినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు తీవ్రగాయాలు



గాయపడిన చిన్నహరివాణం వీఆర్వో దీపిక

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని సిరుగుప్ప క్రాస్ రోడ్డు వద్ద స్కూటీని లారీ ఢీకొట్టడంతో చిన్నహరివాణం వీఆర్వో దీపిక తీవ్ర గాయాలపాలయ్యింది. ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలు.. చిన్నహరివాణం గ్రామంలో వీఆర్వోగా పనిచేస్తున్న దీపిక రోజూ మాదిరిగానే విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా సిరుగుప్ప క్రాస్ వద్ద పక్కనే వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో ఆమెకు కింద పడిపోయింది. ఆమె ఎడమ చేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆదోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఆదోని సెంట్రల్: స్థానిక మండల విద్యాధికారి కార్యాలయంలో అకౌంటెంటుగా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన రమణ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప తెలిపారు. యూటీఎఫ్ పిలుపు మేరకు ఉపాధ్యాయులు తమ తోచినంత సాయం చేయగా పోగైన సొమ్ము రూ.73 వేలను మంగళవారం బాధిత కుటుంబసభ్యులను అందజేశారు. యూటీఎఫ్ మండలాధ్యక్షులు రామాంజినేయులు, ఆడిట్ సభ్యులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కోసిగి: మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామంలో సర్పంచ్ శివలింగమ్మ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మంగళవారం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సోమేష్ దగ్గరుండి వాడవాడలా డ్రయినేజీల్లో పూడిక తొలగించి శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. తాగునీటి గుమ్మీలను శుభ్రం చేశారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

వార్డుల అభివృద్ధే లక్ష్యం



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ బోయ శాంత, జయమనోజ్ రెడ్డి

ఆదోనిటౌన్ : పట్టణంలోని వార్డులో రోడ్లు, కాలువలు, తాగునీటి పైపులైన్లు తదితర సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని 10వ వార్డును సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రస్తుతం చేస్తున్న అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనులను వివరిస్తూ ముందుకు సాగారు. ఏవైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు సన్నీ, కౌన్సిలర్లు సురేష్, రహీం, మధు, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి

పెద్దకడబూరు: వ్యవసాయానికి పగటి పూట 9 గంటల నిరంతర విద్యుత్ అందించాలని రైతు సంఘం నాయకులు మబ్బు ఆంజనేయ, ప్రహ్లాద డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దకడబూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ అంతరాయంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక పక్క వర్షాలు లేక మరో పక్క విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే సంబంధిత అధికారులు మాత్రం పట్టించకోవడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వ్యవసాయానికి నిరంతర విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్ సిబ్బందికి సమర్పించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు రక్ష



సజ్జలగుడ్డంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



హాజరైన ప్రజలు

కోసిగి: ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని, ప్రజారోగ్యానికి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోసిగి మండలం సజ్జలగుడ్డం గ్రామంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్పంచ్ జేకే నరసమ్మ అధ్యక్షతన నిర్వహించిన వైద్య శిబిరానికి వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహాభాగ్యం అని భావించి ప్రతి ఇంటికీ వైద్యాధికారులను పంపించి వైద్య సేవలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. గతంలో నిరుపేదలు కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లి చికిత్స పొందే స్థోమత లేక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. నిరుపేదల కష్టాలను గుర్తించి దివగంత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం అమలు చేసి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ నిరుపేదలకు వైద్య సేవలు అందేలా చేశాడన్నారు. అదేబాటలో ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నారని వివరించారు. పేదల కోసం పాటు పడే ముఖ్యమంత్రి జగన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజలకు వైద్యాధికారులచే పరీక్షలు చేయించారు. ఓపీ ద్వారా గ్రామంలో 453 మంది పరీక్షలు చేయించుకున్నారు. అలాగే ఐసీడీఎస్ సూపర్ వైజర్ కాత్యాయిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పౌష్టికాహార స్టాల్స్ ఎమ్మెల్యే పరిశీలించారు. గర్భిణులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, శ్రీనివాస రెడ్డి, దశరథ్ రెడ్డి, డాక్టర్లు అభిరూప్, రజిత, నాయకులు నాడుగేని నాగరాజు, జగదీష్ స్వామి, కోసిగయ్య, బండ్ల గోవిందు, షౌకత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి పరుగులు

కోసిగి: కోసిగి మండలంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కోసిగి మండలంలోని వందగల్లు గ్రామంలో రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను గ్రామ సర్పంచ్ కాల్వ కొరవంజమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి.మురళీమోహన్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే కొల్మాన్‌పేట గ్రామంలో సర్పంచ్ గుళిగేని జయరాం ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘ నిధులు కింద రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కోసిగి మండలం అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం, ఎంపీ, ఎమ్మెల్యే, మండల పరిషత్ నిధులు దాదాపు రూ.3.50 కోట్లతో కోసిగిలో వాడవాడలా డ్రయినేజీ, సీసీ రోడ్డు వేయించినట్లు తెలిపారు. రూ.6 కోట్లతో స్థానిక రైతుల సంక్షేమం కోసం పులికనుమ నుంచి చేపట్టిన పైప్‌లైన్ పనులు పూర్తి కావొచ్చాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే మండలానికి తాగు, సాగునీటిని అందిస్తామన్నారు. పంచాయతీ రాజ్ డీఈ అశ్వద్దామ, ఏఈ యుగంధర్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మయ్య, నరసింహులు, వెంకటరెడ్డి, అయ్యప్ప, జి.సహదేవ, వి.రమేష్, ఎ.వెంకోబ, గోపాల కృష్ణ, అర్జున్, హనుమంతు పాల్గొన్నారు.



కొల్మాన్‌పేట గ్రామంలో తాగునీటి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం




మాట్లాడుతున్న డాక్టర్ వెంకటసుబ్బయ్య

ఆదోని సెంట్రల్: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని, జూనియర్లతో సోదర భావంతో మెలగాలని డాక్టర్ వెంకటసుబ్బయ్య, స్త్రీ విముక్తి మహిళా సంఘం అధ్యక్షురాలు సుజ్ఞానమ్మలోకేష్ తెలిపారు. మంగళవారం సాయి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జనార్ధన్‌ప్రసాద్ అధ్యక్షతన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కళాశాలలో చిన్నపెద్ద తేడా లేకుండా అందరూ కలిసి ఉండాలని సూచించారు. తోటి విద్యార్థుల పట్ల అప్యాయత కలిగి ఉండాలే తప్ప ఇబ్బందులకు గురి చేయరాదన్నారు. చిన్న చిన్న సమస్యలకు మానసిక సంఘర్షణకు లోనుకాకుండా ఉండాలన్నారు. సమస్యలు వచ్చినపుడు ధైర్యంగా ముందుకు సాగాలేగానీ కుంగిపోకూడదన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరం అని, ర్యాంగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన శిక్షలు తప్పవని వివరించారు. ప్రతి ఒక్కరు చెడు అలవాట్లు, సావాసాలకు దూరంగా ఉండి కష్టపడి చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు నవీన్‌కుమార్, బాలు, విష్ణు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

హొళగుంద: కోగిలతోట గ్రామానికి చెందిన బోయ పార్వతి (29) అనే వివాహిత కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం విలేకరులకు తెలిపారు. సదరు మహిళ ఏడాది క్రితం కవల పిల్లలకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధ పడుతుండేది. ఈ నెల 9న నొప్పి తీవ్రం కావడంతో బాధను తట్టుకోలేక రాత్రి ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు ఆమెను చికిత్స కోసం బళ్లారి పెద్దాసుపత్రి (ఓపీడీ)కి తరలించగా కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు. మృతురాలి తల్లి గాది లింగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

నేటి వైద్య శిబిరాల షెడ్యూల్



వైద్య పరీక్షలు చేస్తున్న ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు

ఆదోని సెంట్రల్: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి గ్రామ/వార్డు సచివాలయాలకు చెందిన ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇంటింటి సర్వే చేపడుతూ మరోపక్క వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. నేడు ఆదోని, మంత్రాలయం నియోజక వర్గాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు.

మండలం	గ్రామం	ప్రదేశం	డాక్టర్
ఆదోని	మదిరె-2	గ్రామ సచివాలయం	షేక్ ఇమ్రాన్ అహ్మద్
కోసిగి	దొడ్డిబెళగల్	ప్రాథమిక పాఠశాల	ఎస్.నజీర్ అహ్మద్
కౌతాళం	నదిచాగి	ప్రాథమిక పాఠశాల	ఎం.ప్రవీణ్‌కుమార్
మంత్రాలయం	మాలపల్లి	గ్రామ సచివాలయం	పి.వసంత

చదువుల తల్లికి సన్మానం



విద్యార్థిని శివలింగమ్మను సన్మానిస్తున్న గ్రామస్తులు

కౌతాళం/ఆదోనిఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చాటిన పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అరుదైన అవకాశం కల్పించింది. ప్రపంచ దేశాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల సత్తాకు గౌరవం కల్పించాలన్న లక్ష్యంతో వారికి ఐక్యరాజ్య సమితి, వరల్డ్ బ్యాంక్, అమెరికా అధ్యక్ష సౌధం సందర్శన భాగ్యం కల్పించడంతో మండలంలోని పొదలకుంట గ్రామానికి చెందిన శివలింగమ్మ ఆయా దేశాలను సందర్శించి స్వగ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామస్తులు ఆమెకు సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లయ్య, ఉచ్చప్ప తదితరులు విద్యార్థిని శివలింగమ్మను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి దేశ విదేశాల్లో పేరు తెచ్చిన శివలింగమ్మను కొనియడారు. అలాగే విద్యార్థిని సోమవారం విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసినట్లు తండ్రి సోమనాథ్ తెలిపారు.

– అలాగే ఆదోని పట్టణంలో భీమాస్ ఫంక్షన్‌హాలులో మంగళవారం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త విట్టా రమేష్, పాత్రికేయులు విద్యార్థిని శివలింగమ్మకు శాలువా వేసి, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఆర్‌యూఎస్‌ఎఫ్ కమిటీ ఎంపిక

ఆదోని సెంట్రల్: రాయలసీమ యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్‌కు నూతన కార్యవర్గ కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి రఘునాథ్ తెలిపారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను పెంచి సన్న బియ్యం సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఆదోని పట్టణ అధ్యక్షులుగా మల్లికార్జున, కార్యదర్శిగా సురేంద్ర, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

నేటి నుంచి మార్కుల జాబితా పంపిణీ

కౌతాళం: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఒరిజినల్ మార్క్స్ లిస్టులను బుధవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ రెగ్యులర్, సప్లిమెంటరీ విద్యార్థుల మార్క్స్ లిస్టు ఒరిజినల్స్ కళాశాలలో సిద్ధంగా ఉన్నాయని, విద్యార్థులు కళాశాల సమయంలో వచ్చి తీసుకెళ్లవచ్చని చెప్పారు.